# నేతి బీరకాయ

—ఎం.సి. శివశంకరశాస్త్రి

ముసురుకున్న ఆలోచనలు కందిరీగలై కుట్టిపడేస్తూంటే నిద్రపట్టక లేచికూర్చుని జేబులోంచి ఓ బీడీతీసి ముట్టించాడు గోపయ్య.

ఈలోగా పక్కసందులో ఓ రెండు కుక్కలు ఏడ్వడం మొదలెట్టేసరికి చిర్రెత్తుకొచ్చి వాటిని బాగా తిట్టుకున్నాడు.

మరుక్షణం ఎందుకో వాటిమీద జాలికల్గి...

"పాపం! విశ్వాసం గలవి. వాటినెందుకు తిట్టుకోవాలి. ఈ మాయదారి లోకంలో మనుషులకన్నా ఇవే నయం. కనీసం ఇవైనా నా పరిస్థితిని అర్థం చేసుకున్నాయి కనుక జాలిగా అయ్యో అంటూన్నాయి" వాటి అరుపుల్ని తనకు అనుకూలంగా సమర్థించుకుని బీడీదమ్ము పీల్చాడు.

అప్పటికే అది ఆరిపోయింది. పక్కనే ఉన్న అగ్గిపెట్టె అందుకుని ఆరిపోయిన బీడీ ముక్కను మళ్ళీ వెలిగించి ఓ రెండు దమ్ములులాగి దాన్నలా నలిపి పక్కకి విసిరి పడేశాడు.

అతని బుర్రలో తుఫాను చెలరేగింది.

"ఛీ! ఛీ!! ఊడయమ్మా. ఇది ఊరూకాదు. ఇక్కడువాళ్ళు మనుషులూ కాదు. ఉన్నది ఉన్నట్టుగా నిజంచెప్పే ధైర్యంలేని పిరికి నాకొడుకులు కాబట్టి ఒక్కడుకూడా నావేపు సాక్ష్యం చెప్పలేకపోయాడు. నిజంగా దేవుడనేవాడే ఉంటే ఈ ఊరినీ క్షణాల్లో పూడ్చుకు పోయేలా చేస్తే ఎంత బావుణ్ను." కసితీరా తిట్టుకున్నాడా ఊరినీ అక్కడి జనాన్నీ.

పెదకాపుగారి వసారాలోని పాతకాలప గోడ గడియారం మూడు గంటలు కొట్టి నిశ్శబ్దాన్ని ఛేదించింది. గోపయ్యకి వంటిమీద జెర్రులు పాకినట్లయింది.

★ ★ ★

రెండొందల పైచిలుకు ఇళ్ళున్న ఆ ఊళ్ళో మనిషికో మతలబు, ఇంటికో రాజకీయం ఉంది.

ఉన్నవాళ్ళల్లో ఎక్కువశాతం పేద జనాలే.


కోటగా పిలువబడే ఎగువభాగంలో ఉన్న రైతు వర్గానికి కొద్దిపాటి ఆస్తిపాస్తులున్నాయి కాబట్టి పేదవాళ్ళపై పెత్తనం చలాయిస్తూ అక్కడి వాళ్ళకు పాలకవర్గమై కూర్చొన్నారు.

పోలీసుస్టేషన్, కోర్టు, జైళ్ళ మెట్లెక్కి దిగటం అక్కడి జనావళికి మామూలే!

అలాంటి ఊరికి ఓ పదేళ్ళ క్రితం బతుకుదెరువుకై భార్యా, తనకు ఏకైక కూతురితో వచ్చి స్థిరపడి పోయాడు గోపయ్య.

పెదకాపు రామయ్యగారి పదెకరాల పట్టివానుకుని ఉన్న ఓ రెండెకరాల కొటివరం కొనుక్కుని రేయింబవళ్ళూ తల్లీ పిల్లా చెమటోడ్చి పనిచేసి తద్వారా వచ్చిన ఫలసాయంతో గుట్టుగా బతుకుబండి నడుపుకుంటున్నారు.

మూడేళ్ళక్రితం అనారోగ్యరీత్యా భార్యకన్నుమూసింది. ఇక మిగిలిందల్లా తనూ, తన పదిహేనేళ్ళ కూతురు గౌరి. తల్లీ తండ్రి అన్నీ తానేఅయ్యి గౌరిని కనుపాపలా పెంచుకుంటున్నాడు.



★ ★ ★

పెదకాపంటే ఆ ఊరికో పెద్దపులి. అక్కడి సామాన్య జనమంతా అతడేం చెప్తే అదే వేదమనుకునే గొర్రెలు.

బియ్యంలో మెరికలా గోపయ్యమాత్రం పెదకాపుకు ఎప్పటికీ ప్రత్యర్థే. ప్రతియేటా పొలంసాగుచేయిస్తూ జానెడో, బెత్తెడో భూమిని తనపొలంలోకి కబ్జా చేసుకుంటూ దాదాపు అరెకరందాకా కబళించేశాడు పెదకాపు.

అది తెలుసుకుని 'ఏంటండీ ఈ దారుణం' అని నడివీధిలో నిలదీస్తే బండబూతులన్నీ తిట్టి 'అతిగా వాగేవంటే దిక్కులేని చావు ఛస్తావ్ దొంగ నాకొడకా!' గోపయ్యని బెదిరించాడు పెదకాపు.

అనంతరం కొంతకాలం సాగిపోయింది.

ఆ రోజు సూరీడు పడమటి కొండల్లోకి జారుకుని కొంచెంసేపయింది. పొలంగట్టున గిత్తల్ని మేపుకుని ఒంటరిగా ఇంటికి తిరిగొస్తోంది గౌరి. తననెవరో వెంబడిస్తున్నట్టనిపించి వెనక్కి తిరిగి చూసింది.

"ఏంటేగౌరీ! ఉగాది పోయాక నీ పెళ్ళని విన్నాను. నిజమేనా?" గౌరి పలుకలేదు.

మళ్ళీ అదే ప్రశ్న.

"నీ కెందుకూ?" పెదకాపు కొడుకు ప్రశ్నకు గౌరి సమాధానం.

"ఓహో! ఆ రోజు పొలంలో ఎద్దులెందుకు మేపావని నేను తిట్టానని నామీద కోపమా?" ఇంకో ప్రశ్న.

"మాటాడవేంటే? ఇదిగో నామీద కోపమేమయినా ఉంటే నన్ను క్షమించు" అడుగులు వడిగావేసి గౌరి చేతులు పట్టుకున్నాడు.

"ఛీ! వదిలిపెట్టు" కసిరికొట్టింది.

"ఓయబ్బో! అంతకోపమైతే ఎట్టాగే" గభాలున ముద్దెట్టుకోబోయాడు.

ధువుక్కున ముఖాన ఉమ్మేసి పారిపోయింది.

"పులినోట పడ్డాక పుట్టిల్లు కద్దా అని నమ్మకాదని ఇంకేడికెళ్తావే!" మొత్తుకుంటున్నా వదలకుండా బలవంతంగా ఎత్తుకుని గబగబా జొన్నల్లోకి తీసుకెళ్ళాడు గౌరిని.

గౌరికి దిక్కుతోచలేదు. జరిగిన విషయం పదుగురికీ చెప్పి పరువు రచ్చకీడుస్తానంటూ భోరు భోరున ఏడ్చేసింది.

"నా గురించి పదుగురికీ చెబుతావా? ఎలా చెబుతావో చూస్తాను" పెద్ద పులై గాండ్రించి మీదికి దూకాడు పెదకాపు కొడుకు.

ఎద్దులు తిన్నగా ఇల్లు చేరుకున్నాయి.

వాటిని తోలుకెళ్ళిన కూతురు వెంట రాకపోయేసరికి గోపయ్యకు బెంబేలెత్తి తత్తర పుట్టింది. చకచకా పొలంవైపు పరుగులు తీశాడు. దరిదాపుల్లో గౌరి కనిపించలేదు. అనుమానం ఉన్నచోటల్లా వెతికి చివరికి కాళ్ళీడ్చుకుంటూ దిగాలుగా ఇంటిదారి పట్టాడు.

మరునాడు ఉదయం ఇరుగుపొరుగందరూ చెప్పగా ఉరకలు తీస్తూ ఊరిముందరి పెద్దబావి దగ్గరికెళ్ళి చూసేసరికి బోర్లాపడి నీటతేలుతోన్న గౌరి శవం కనిపించింది.

లోకమంతా చిమ్మచీకటైపోయినట్టనిపించి పొర్లి పొర్లి ఏడ్చాడు గోపయ్య.

ఈలోపు ఊరిజనమంతా పోగయ్యారక్కడ.

ఏవేవో గలిబిలి మాటలు.

"పాపం! చాలా మంచిపిల్ల - ఏమయిందో ఏమో" ఒకడన్నాడు.

"మంచోళ్ళకే ఇలాంటి సావులు" మరొకడు.

"నిప్పులాటిపిల్ల. ఎందుకిలా చేసుకుందో ఏమో?" ఇంకొకడు.

"నిన్న సాయంత్రం కొద్ది సీకటిపడ్డాక పెదకాపు గారబ్బాయి ఈ పిల్లని బలవంతంగా జొన్నచేలోకి ఎత్తుకెళ్తుండగా నేను చూశా పెద్దయ్యా!" వేరొకడి మాటలు.

"అవున్రా నేకూడా చూశాను."

"పెదకాపు గారబ్బాయికి ఈ పిల్లమీద ఎంతోకాలంగా కన్నుపడింది. అవకాశం దొరికేసరికి ఆకలితీర్చుకొని ఏమోసేసినట్టున్నాడు."

"అదంతా మనకెందుకురా!

ఒక్కొక్కరొక్కొక్క తీరుగా గుంపులో నుంచుని అనుకుంటూంటే గోపయ్యకి తలలో నరాలు చిట్లిపోతున్నాయ్.

ఈలోగా పోలీసులూ. వారి వెంట పెదకాపు వచ్చారు.

"నీకెవరి మీదైనా అనుమానం ఉందా?" అడిగాడు యస్.ఐ.

"అఁ! పెదకాపు రాఘవయ్యగారబ్బాయే ఈ పని చేసుంటాడు. సాయంత్రం కొద్ది సీకటిపడ్డాక మా అమ్మాయి పొలంనుంచీ ఎడ్లుతోలుకొని ఇంటికొస్తాండగా బలవంతంగా జొన్నచేలోకి ఎత్తుకుపోయాడట. కళ్ళారా చూసినోళ్ళు కూడా ఇక్కడే ఉన్నారు. కావాలంటే అడిగి తెల్సుకోండి."

అందాక అమ్మాయి గురించి మాటాడుకున్న వాళ్ళం దర్నీ చూపించి అన్నాడు గోపయ్య.

వాళ్ళకేసి చూశాడు యస్.ఐ.

ఎవ్వరూ నోరిప్పలేదు.

మళ్ళీ గోపయ్యకేసి చూశాడు సబ్ఇన్‌స్పెక్టర్.

"మీకందరికీ ఏమయిందిరా! ఇంతవరకు నేను చూశానంటే నేను చూశానని వాగిచచ్చారే... ఉన్నపళంగా మీనోళ్ళన్నీ పడిపోయాయా?" అరిచాడు గోపయ్య.

ఎవ్వరూ పలుకలేదు.

"ఒరేయ్ గోపయ్యా! ఈ భూమ్మీద జీవిపుట్టిందీ అంటే ఏదో ఒక రోజున చావక తప్పదురా పిచ్చోడా! లేకపోతే ఈ భూమితల్లి ఎంతబరువని మోస్తుంది చెప్పు? ఇదిగో పోలీసోళ్ళ విషయంనే చూసుకుంటామగాని ఇప్పటికీ డబ్బులు పట్టుకెళ్ళి జరగాల్సిన కార్యక్రమాలన్నీ ముందవజేసేయ్"

ఓ మూడువందలు చేతికి అందివ్వబోతూ మెట్ట వేదాంతం వల్లించాడు పెదకాపు.

ఆ డబ్బు అతని ముఖాన విసిరికొట్టేసి నోటి కొచ్చినట్టల్లా తిట్టి పడేశాడు.

అనంతరం జరగాల్సిందంతా జరిగిపోయింది. గౌరి పెళ్ళికోసం కూడబెట్టిన డబ్బంతాపోసి కోర్టుకెళ్ళాడు గోపయ్య. ప్రతివేలా చెప్పులరిగేలా కోర్టుచుట్టూ తిరగడవే తప్ప కేసుమాత్రం ఎటూతేలటం లేదు.

కోర్టు దగ్గర అతన్ని చూసిన జనం వెకిలిగా నవ్వటం మొదలయింది. నిద్రపట్టని కారణంగా లేచికూచుని బీడీ కాలుస్తూన్న గోపయ్యకి గతంలో జరిగిందంతా సూన గుచ్చినట్లుగా మరోసారి గుర్తుకొచ్చింది. దిక్కుతోచక అయోమయంలో పడ్డారు. తనలో తాను వివరీతంగా గొణుక్కున్నాడు.

★ ★ ★

కోర్టుహాలు కోలాహలంగా ఉంది.

గౌరికేసు తుదితీర్పు ఆరోజే పెదకాపు రాఘవయ్యగారి తరపున దాదాపు లారీ జనం వచ్చారు కోర్టు దగ్గరికి.

ధర్మాసనం మీద కూచున్న న్యాయాధికారి తుది తీర్పు చదవటం మొదలెట్టారు.

"మాముడూరు గ్రామ వాస్తవ్యుడగు కందుల గోపయ్య కూతురు గౌరిని సదరు గ్రామానికి చెందిన పెదకాపు రాఘవయ్యగారి కుమారుడు హరికృష్ణ అనేయువకుడు పొలంనుంచి ఇంటికి ఒంటరిగా తిరిగివస్తూన్న అమ్మాయిని బలాత్కరించి, ఆ విషయం పదుగురికి చెబుతుందన్న భయంతో చంపివేశాడని అభియోగం మోపబడింది. ఈ విషయంలో దాదాపు పదకొండు నెలలపాటు విచారణ జరపటం జరిగింది. అయితే ఈ కేసులో ప్రత్యక్షసాక్ష్యాధారాలేవీ దాఖలు కాలేదు. హతురాలైన గౌరి శీలం కోల్పోయినట్టుగా కాని, బలవంతంగా ఆమెను చెరచినట్టుగా కానీ శవపరీక్షలో రుజువు కాలేదు. పై ఆధారాలను బట్టి గౌరికి బతుకుమీద విరక్తిపుట్టి ఆత్మహత్య చేసుకుని ఉంటుందేతప్ప మరే కారణమై ఉండదని నిర్ధారణ చేస్తూ ఈ కేసును కొట్టివేయడమైనది" అని తీర్పు వినిపించారు.

పెదకాపువర్గం వాళ్ళు పట్టరాని ఆనందంతో హద్దులు మీరి కోర్టు హాలు దద్దరిల్లేలా ఒక్కసారిగా ఈలలువేసి కేరింతలు కొట్టారు.

"ఇదెక్కడి న్యాయం బాబయ్యా! ఇదెక్కడి న్యాయం!! న్యాయం రుజువవుతుందని నమ్మి కోర్టుకొచ్చాను. నేతి బీరకాయలో నెయ్యి ఉంటుందనుకోవటం నాదే తప్పని తెలుసుకున్నాను" గద్గద కంఠంతో రోదిస్తూ "అబ్బా" బాధగా అని కుడిచేత్తో గుండెను రుద్దుకుంటూ గోడనానుకుని అలామెల్లిగా కూలబడిపోయి క్షణాల్లో కోర్టుహాల్లోనే మెడవాల్చేశాడు గోపయ్య.

యం. పి. శివశంకరశాస్త్రి
డిప్యూటీ ఇంజనీరు, W - 205.
హెచ్.ఎమ్.టి. (పోస్టు) హైదరాబాదు - 500 854.

## ఆశామయి జీవితం!

వట వృక్షానికి పత్రాలెన్ని?
ఆకసాన చుక్కలు ఎన్ని?
సింధువులో బిందువులెన్ని?
సైకతాన రేణువులెన్ని?
ఈ
బుద్బుధ జీవనయానంలో
మనిషికి ఆశలు అన్ని!

కాశీనాథ & కాశీనాథ,
కె. రామచంద్రరావు
లెక్చరర్, మిగ్ ఇ.నెం.40,
ఒంగోల్ - 523 002